క్లుప్తంగా

సేవలకు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న స్వాతి

మదనపల్లె సిటీ: సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ధాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ స్వాతికి సామాజిక ప్రతిభా పురస్కారం దక్కింది. మదనపల్లెలో ధాత్రి వృద్ధాశ్రమంతోపాటు పలువురికీ ఆమె చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు తిరుపతి వే ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంకయ్య తెలిపారు. స్వాతి మాట్లాడుతూ పురస్కారం మరింత సామాజిక బాధ్యత పెంచిదని అన్నారు.

యల్లమ్మతల్లికి పూజలు


అలంకరణలో యల్లమ్మతల్లి

కేవీపల్లె: మండలంలోని గర్నిమిట్టలో వెలసిన యల్లమ్మతల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారిని అభిషేకించి అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు బోనాలు ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

నిధుల తవ్వకాలపై ఆరా

పెద్దతిప్పసముద్రం: మండలంలోని హంద్రీ నీవా కాలువ దిగవ భాగాన గుర్తు తెలియని దుండగులు తవ్వకాలు చేపట్టిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆదివారం ఘటనా స్థలానికి చేరుకుని క్షుద్ర పూజలు చేసిన విధానాన్ని పరిశీలించారు. ఆ స్థలంలో బలమైన రాతి బండలను తొలగించిన జేసీబీ వాహనం ఎవరిదనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.

16 నుంచి మారేళ్లలో ఉరుసు

కేవీపల్లె: మండలంలోని మారేళ్లలో ఈ నెల 16వ తేదీ నుంచి మూడు రోజులపాటు హజరత్ మహబూబ్ సుబహానీ బాబా ఉరుసే షరీఫ్ ఉరుసు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 16న గంధం, ఫకీర్ల మెరవణి, ఫాతెహా ఖ్వానీ, 17న ఉరుసు, ఖవ్వాలీ పోటీలు ఉంటాయని తెలిపారు. 18న ఫాతెహా, జెండా ఊరేగింపు ఉంటుందని, హిందూ ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని ఉరుసును జయప్రదం చేయాలని కోరారు.

వధూవరులకు ఆశీర్వాదం


వధూవరులతో చింతల రామచంద్రారెడ్డి

పీలేరురూరల్: మండలంలోని సామలవారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు చక్రపాణిరెడ్డి కుమారుడు సంతోష్‌రెడ్డికి పలమనేరుకు చెందిన శివారెడ్డి కుమార్తె లోకేశ్వరితో స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం వివాహం జరిగింది. ఈ వివాహానికి మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి హరీష్‌రెడ్డి, పార్టీ నాయకులు గోపిసుధీర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, కేశవరెడ్డి, మస్తాన్, రమణ, మదనమోహన్‌నాయుడు, ఆంజినేయులునాయుడు, సర్పంచ్‌లు దండు జగన్‌మోహన్‌రెడ్డి, హబీబ్‌బాషా, చంద్రారెడ్డి తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఏనుగుమల్లమ్మకు పూజలు


ఏనుగుమల్లమ్మ

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్‌పై వెలసిన ఏనుగుమల్లమ్మ ఆదివారం విశేష ఆలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు, సందర్శకులు దర్శించుకుని పూజలు చేయగా వారికి తీర్థప్రసాదాలను అందించారు.

నేడు నకిలీ మద్యంపై వైఎస్సార్‌సీపీ నిరసన

ములకలచెరువు: నకిలీ మద్యం తయారీ, విక్రయాలు, మరణాలను నిరసిస్తూ ములకలచెరువులో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చే పార్టీ శ్రేణులు స్థానిక కూడలి నుంచి బయలుదేరి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుంటారు. అక్కడ నిరసన వ్యక్తం చేసి అధికారులకు వినతిపత్రం అందజేస్తారు.

జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ

రాజంపేట టౌన్ : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా ఇటీవల కడపలో జరిగిన ఉమ్మడి వైఎస్సార్ జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో రాజంపేటకు చెందిన పలువురు క్రీడాకారులు ప్రతిభ కనబరచి పతకాలను సాధించారు. ఈ విషయాన్ని స్కేటింగ్ కోచ్ వినోద్‌కుమార్ ఆదివారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. ఈ పోటీల్లో రాజంపేట నుంచి పదిమంది క్రీడాకారులు పాల్గొనగా, ఆరుమంది పతకాలు సాధించారన్నారు. వీరిలో భువనేశ్వర్ గోల్డ్ మెడల్ సాధించగా, భవ్య బ్రాంజ్ మెడల్ సాధించింది. మను, తేజ్‌సాయి, మనస్విత, జమాల్‌వలీలు రెండు విభాగాల పోటీల్లో పాల్గొని రెండు విభాగాల్లోను సిల్వర్ మెడల్స్ సాధించారన్నారు.

అక్రమార్కుడి అరెస్టుతో.. అనుచరుల్లో ఆందోళన

- జయచంద్రారెడ్డి అండతో బిల్లులు చేసుకునే యత్నం
- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ అనుచరుల ప్రదక్షిణ



మదుమూరు సమీపంలో జరుగుతున్న పనులు (ఫైల్)

పెద్దతిప్పసముద్రం: తంబళ్లపల్లి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డి కల్తీ లిక్కర్ కేసులో ఇరుక్కుపోవడంతో ఆయన అనుచర వర్గీయుల్లో ఆందోళన మొదలైంది. అధిష్టానం ఆయనపై సస్పెండ్ వేటు వేయడంతో అనుచరులు మరింత ఉలిక్కిపడ్డారు. నకిలీ మద్యమే కాదు.. ఇన్నాళ్లూ జయచంద్రారెడ్డి అండతో లక్షల రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్నారని కూటమి వర్గీయులే బాహాటంగా విమర్శించిన ఘటనలు కోకొల్లలు. ప్రధానంగా పంచాయతీరాజ్, ఉపాధిహామీ, వాటర్‌షెడ్, ఆర్‌డబ్ల్యూఎస్, భూగర్భ గనుల శాఖల ద్వారా జరిగిన పనుల్లో అధికంగా అవకతవకలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలున్నాయి. ఇన్‌చార్జి సస్పెన్షన్‌కు ముందు ఆయన అనుచరులు ఇష్టారాజ్యంగా చేసిన పనులకు బిల్లులు చేసుకోవాలనే తాపత్రయంతో ఇపుడు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నిబంధనలకు తిలోదకాలు

వాటర్‌షెడ్ పథకం కింద ఎంపిక చేసిన ఆరు గ్రామ పంచాయతీల్లో 26 ఫారంపాండ్స్, 33 మినీ పర్కులేషన్ ట్యాంకులు, 58 డగౌట్ పాండ్స్, ఒక ట్రెంచ్ పనులు చేపట్టారు. ఇప్పటివరకూ ఈ పనుల కోసం రూ.1.28 కోట్ల నిధులు వెచ్చించారు. చెరువులు, కుంటలు, వంకలు లాంటి ప్రదేశాల్లో డగౌటా పాండ్స్ పనులు చేపట్టకూడదనే ప్రభుత్వ నిభంధనలకు తెలుగు తమ్ముళ్లు తిలోదకాలు పలికారు. చెరువుల్లో చేసిన పనులన్నీ భారీ వర్షాల కారణంగా గంగార్పణం అయ్యాయి. అయినా బిల్లుల కోసం జయచంద్రారెడ్డి వర్గీయులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. మదుమూరు పంచాయతీ పరిధిలో డగ్ అవుట్ పాండ్స్, ఎంపీటీ పనులను గ్రామ స్థాయి కూటమి నాయకులు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టారు. పనులపై నిషేధం ఉన్నా.. క్షేత్ర స్థాయి సిబ్బంది కూటమి నాయకులతో కుమ్మక్కై లక్షల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేశారని వాటర్‌షెడ్ చైర్మన్ శ్రీనివాసులురెడ్డి పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం ఇందుకు అద్దం పడుతోంది.

పనులు నిలిపివేశాం

మదుమూరు పంచాయతీలో ప్రజల నుంచి వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నెల రోజుల నుంచి ఎలాంటి పనులు చేయకుండా నిలిపివేశాం. వాటర్‌షెడ్ కమిటీ తీర్మానం లేకుండా, అనధికారికంగా పనులు చేసినా బిల్లులు పెట్టే ప్రసక్తే లేదు. చెరువులు, కుంటలు, వంకల్లో చేసిన పనులకు బిల్లులు పెట్టలేదు.

– ఖాజామొహిద్దీన్, వాటర్‌షెడ్ పీవో, ములకలచెరువు

సేవా కార్యక్రమాలతోనే మనిషి జన్మకు సార్థకత

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్


ఈశ్వరయ్యను సత్కరిస్తున్న నిసార్‌అహ్మద్, నాయకులు

రామసముద్రం: సర్వమత సామరస్యం పాటిస్తే సేవా కార్యక్రమాలు చేపట్టినపుడే మనిషి జన్మకు సార్థకత ఉంటుందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిస్సార్‌అహమ్మద్ అన్నారు. మండలంలోని చెంబకూరు జియోన్ చర్చిలో ఆదివారం ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అంతకు ముందు చర్చి నిర్వాహకులు, క్రిస్టియన్ మత పెద్దలు, స్థానిక వైఎస్సార్సీపీ నాయకులు ముందుగా నిస్సార్‌అహమ్మద్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన చెంబకూరు వైఎస్సార్సీపీ ఎంపీటీసీ వెంకటమ్మ భర్త అంగడి చిన్నప్ప మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. వైఎస్సార్సీపీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ జాన్, పాల్ చంద్రశేఖర్, రాజేష్, రఘునాథరెడ్డి, చంద్ర, రవి, ఈశ్వర్ రెడ్డి, షంషీర్, షఫీ, ఎల్ ఐసి శ్రీనివాసులు, విజయ్ రాజు, తిప్పరాజు, బషీర్, జింకల శ్రీనివాసులు, రాజన్న, నూర్ మొహిద్దీన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె: ఆధ్యాత్మిక చింతనతో ఆత్మ స్థైర్యం కలుగుతుందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ హ్మద్ అన్నారు. మండలంలోని రెడ్డిగానిపల్లెలో ఆదివారం నిర్వహించిన మహా గణపతి, సుబ్రహ్మణ్య, పార్వతి, శివలింగ సహిత నవగ్రహ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఆదివారం ఆయన హాజరయ్యారు. పూజల అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన ప్రతి ఒక్కరిలో ఉండాలని, దాని వల్ల మానసిక ప్రవృత్తిలో మార్పువచ్చి సన్మార్గంలో నడుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం, నాగరాజు, రామమూర్తి, కృష్ణప్ప, శివశంకర్, రామ్మోహన్, రాజన్న, చిన్నప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వరయ్యకు సత్కారం

భారత్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్న విద్యావేత్త, డాక్టర్ ఈశ్వరయ్యను ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ మదనపల్లె సమన్వయకర్త నిసార్‌అహ్మద్ ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పాఠశాలల విద్యా నియంత్రణ మండలి సభ్యులుగా విశేష సేవలను అందించారన్నారు. తెట్టు సర్పంచు నులక మనోహర్‌రెడ్డి, మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వీఎస్.రెడ్డి, కౌన్సిలర్లు ఈశ్వర్‌నాయక్, చంద్రశేఖర్, విజయకుమార్‌రెడ్డి, తాజ్‌బాషా, దస్తగిరి, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

నవంబరు 7న హాకీ ఇండియా సెంటనరీ ఉత్సవాలు


మాట్లాడుతున్న శివప్రసాద్

మదనపల్లె సిటీ: నవంబరు 7న హాకీ ఇండియా సెంటనరీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు హాకీ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక బీటీ కాలేజీ హాకీ మైదానంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ హాకీ ఇండియా అసోసియేషన్ స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా హాకీ ఇండియా అసోసియేషన్ అక్టోబరు 7న మదనపల్లెలో బాల, బాలికలకు హాకీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడల్లో పాల్గొన్న జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడాకారులను ప్రత్యేకంగా సన్మానిస్తామన్నారు. బీటీ కాలేజీలోని హాకీ మైదానంలో హాకీ పితామహుడు ధ్యాన్‌చంద్ క్రీడను నేర్పించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ప్రసాద్‌రెడ్డి, పీడీ జలజ, తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో మహిళలకు ఉచిత వైద్య శిబిరం


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కలికిరి: స్థానిక జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో మహిళలకు ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీనివాస చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ వారి ఆర్థిక సహకారంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా వైద్య నిపుణులు 40 మందికి గర్భాశయ క్యాన్సర్ వైద్య పరీక్షలు నిర్వహించి జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సర్వైకల్ క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్య పరీక్షలు నిర్వహించుకున్న మహిళలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస చారిటబుల్ ట్రస్టీ డా.పీవీ.బ్రహ్మారెడ్డి, ప్రిన్సిపల్ వేంకటేశ్వరరావు, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ అపర్ణ, ట్రస్టు సభ్యులు శ్రీనివాసరెడ్డి, పీఓ శశికుమార్‌రెడ్డి, డా.జిలానీ, షబ్బీర్, బాషా, తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి దేశానికి సిగ్గుచేటు



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న పీటీయం.శివప్రసాద్

మదనపల్లె: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్.బి.ఆర్.గవాయ్‌పై జరిగిన దాడి, దేశానికే సిగ్గుచేటు అని వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీయం.శివప్రసాద్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వీసీకే, బాస్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్.గవాయ్ దళితుడు కాబట్టే..కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడం లేదని ఆరోపించారు. మతోన్మాది రాకేష్ కిషోర్‌కు భారత పౌరసత్వం రద్దు చేసి, దేశ బహిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు. విశ్రాంత పోస్టల్ సూపరింటెండెంట్ యం.చెన్నకేశవులు మాట్లాడుతూ జస్టిస్ గవాయ్ మీద జరిగిన దాడి... భారత న్యాయవ్యవస్థ, రాజ్యాంగం, దేశంపై జరిగిన దాడిగా పరిగణించాలన్నారు. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా, నేషనల్ మాన్యుమెంట్ అథారిటీ పరిధిలో ఉన్నందున, ఖజురహోలోని ఏడు అడుగుల తలలేని విగ్రహం రెన్యువేషన్ కోసం సుప్రీంకోర్టులో వేసిన పిల్‌ను జస్టిస్ గవాయ్ అనుమతించలేదన్నారు. ఇందులోని హేతుబద్ధతను అర్థం చేసుకోకుండా సనాతన ధర్మాన్ని కించపరిచారని రాకేష్‌కిషోర్ అబద్ధాలు చెపుతున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో వీసీకే, బాస్ నాయకులు నీరుగట్టి రమణ, సొన్నికంటి రెడ్డెప్ప, వై.గంగాధర్, జి.వి. రమణ, సింగన్న, తెట్టు శ్రీనివాసులు, బండకోట రవి, బురుజు జనార్ధన్, నీరుగట్టి రాజేష్, డి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యంతో ప్రాణాలు తీస్తారా?


సమావేశంలో మాట్లాడుతున్న షమీం అస్లాం

మదనపల్లె: నకిలీ మద్యం.. ప్రజలచే తాగించి ప్రాణాలు తీస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గుండ్లూరి షమీం అస్లాం మండిపడ్డారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆదివారం విలేకరులతో వారు మాట్లాడుతూ నకిలీ మద్యం తయారీ, విక్రయాలకు నిరసనగా పార్టీ పిలుపు మేరకు సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఎక్సైజ్ స్టేషన్ ఎదుట నిరసన చేపట్టి అధికారులకు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నకిలీమద్యం విక్రయాలు సాగిస్తూ ప్రజారోగ్యంతో చెలగాటం అడుతున్నారన్నారు. నకిలీ మద్యం తయారీ కేసుల్లో టీడీపీ నేతలే నిందితులుగా ఉన్నారని పేర్కొన్నారు. ఆక్రమార్జనతో ఎవరెవరు వాటాలు వేసుకుంటున్నారని ఆమె ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి నిజాయితీ ఉంటే తక్షణమే నకిలీమద్యం తయారీ సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినుతా బాయి, శారదరెడ్డి, జయశ్రీరెడ్డి, వైజయంతి, నాగమణి, మల్లిక, మంజుల, శ్యామల పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమానికి తరలిరండి

స్థానిక ఎక్సైజ్ స్టేషన్ ఎదుట జరిగే నిరసన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని మున్సిపల్ చైర్మన్ వరపన మనూజ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. నకిలీ మద్యం సమూలంగా నిర్మూలించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలని కోరారు.

నేడు వైఎస్సార్‌సీపీ నేతల నిరసన

మదనపల్లె రూరల్: గ్రామ పంచాయతీల అభివృద్ధిని రాజకీయంగా అడ్డుకోవడాన్ని నిరసిస్తూ స్థానిక సబ్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు సోమవారం నిరసన తెలపనున్నారు. తెలిపారు. పంచాయతీ తీర్మానం లేకుండా నిధులు ఎంపీడీఓ డ్రా చేయడం, పంచాయతీ అభివృద్ధిలో వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం సమస్యలపై నిరసన ఉంటుందన్నారు.

మూలకు చేరిన 104 వాహనాలు



మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణంలో 104 మొబైల్ వాహనాలు మూలకు చేరుకున్నాయి. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పు పడుతున్నాయి. గతంలో గ్రామాలకు 104 వాహనాల్లో వెళ్లి గ్రామీణులకు వైద్యసేవలందించారు. ఇటీవల కొత్త వాహనాలు రావడంతో పాత వాహనాలు మూలకు చేర్చారు. లక్షలాది రూపాయలు పెట్టిన వాహనాలను వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

– మదనపల్లె సిటీ:

పోరాటాల ఫలితమే సర్క్యులర్ రద్దు

రాయచోటి అర్బన్ : సీఐటీయూ అండతో వీఓఏలు చేసిన పోరాటాల ఫలితమే కాల పరిమితి సర్క్యులర్ రద్దు అయ్యిందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం రాయచోటిలో ఏర్పాటు చేసిన సమావేశంలో జరిగిన వెలుగు యానిమేటర్ల జిల్లా మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న రోజుల్లో వీఓఏలకు నాణ్యమైన సెల్‌ఫోన్‌లు ఇచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి తిరుపతయ్య మాట్లాడుతూ 27, 28 తేదీల్లో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ంద్యాల వీఓఏల జిల్లా అధ్యక్షులు సోమన్న, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్, రామాంజులు, భాగ్యలక్ష్మి, సంఘం నాయకులు రెడ్డెప్ప రెడ్డి, కృష్ణమ్మ, సుబ్రమణ్యం పరంజ్యోతి, ఊతప్ప, పవన్, ఆనంద్, నిర్మల, నాగ సులోచన, శారద, నలుమూలల నుంచి యానిమేటర్లు పాల్గొన్నారు.

నిరుపయోగంగా గెస్ట్ హౌస్

గాలివీడు : వెలిగల్లు జలాశయం వద్ద సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన గెస్ట్ హౌస్ నిరుపయోగంగా మారింది.బోటింగ్‌కు వెళ్లే దారిలో ప్రాజెక్ట్ పర్యవేక్షణ కోసం లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన గెస్ట్ హౌస్ చుట్టూ కంప చెట్లు, పిచ్చిమొక్కలతో బూత్ బంగ్లాను తలపిస్తోంది. దీనిపై అధికారులు దృష్టి కేంద్రీకరించకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గెస్ట్ హౌస్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పోటెత్తిన భక్తులు

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ముందుగా ఆలయాన్ని వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

కష్టపడే కార్యకర్తలను గుర్తించండి


మాజీ ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మస్తాన్

కలకడ: పీలేరు నియోజకవర్గంలోని అప్రతి గ్రామంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కష్టపడే కార్యకర్తలను గుర్తించాలని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతలరామచంద్రారెడ్డి అన్నట్లు పీలేరు నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు కెఎస్.మస్తాన్‌అహమ్మద్ తెలిపారు. మండల సోషల్ మీడియా అధ్యక్షుడు బివి.నాయుడు, మైనార్టీ నాయకులు హసన్‌షాలతో కలిసి ఆదివారం మాజీ ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం చేపట్టనున్న నిరసన కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు హసన్‌షా, బాబు, ఖాదర్‌బాషా, షకీల్‌అహమ్మద్, జమ్రుద్, నూర్‌అహమ్మద్, జబ్బార్ పాల్గొన్నారు.

సంప్రదాయాలను కాపాడడం ఆర్‌ఎస్‌ఎస్ విధి


ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలతో భానుప్రకాష్, తదితరులు

కలకడ: దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడం ఆర్‌ఎస్‌ఎస్ విధి అని అన్నమయ్య జిల్లా ఆర్‌ఎస్‌ఎస్ కార్యవాహ పర్వతాల భానుప్రకాష్ అన్నారు. మండలంలోని కదిరాయచెర్వు ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవధ నిషేదించాలని, ప్రతి గ్రామంలో రామాలయం నిర్మించాలని పోరాటాలు చేస్తున్న సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ మాత్రమే అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలతో ఎవ్వరికీ నష్టం లేదన్నారు. ఈకార్యక్రమంలో మధు సూదన్, చోట వెంకట్రమణ, వేంకటేష్, సర్పంచ్ లక్ష్మీప్రసన్న, గోపాల్‌నాయుడు, మధు, రెడ్డిలక్ష్మి, రామక్రిష్ణ, భాస్కర్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలి


మాట్లాడుతున్న ఏపీఎన్‌జీఓ నాయకులు వెంకటేశ్వరరెడ్డి

రాయచోటి టౌన్ : పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్ల సంఘం రాష్ట్ర నాయకులు పీసీ రెడ్డెన్న డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రమైన రాయచోటి ఎన్‌జీఓ హోంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ (ఏపీజీపీఏ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్లకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో పోరాటానికి సిద్ధం కావాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. పెన్షనర్ల ఆరోగ్య సమస్యలు, ఆర్థిక సమస్యలు ఉన్నాయని కావున ఆర్థిక పరిష్కారం చూపాలని కోరారు. ఎన్జీఓ తాలూకా అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ పెన్షనర్ల బకాయిలు విషయంలో ఏపీ ఎన్‌జీఓ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ అలపర్తి విద్యాసాగర్ సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకొంటారని చెప్పారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల అభ్యున్నతికి ఎల్లవేళలా తమ అసోసియేషన్ పని చేస్తుందని చెప్పారు. అనంతరం పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఎన్జీఓ అధ్యక్షులు కామ్రేడ్ ఎం.పెంచలయ్య మృతిపై సంతాపాన్ని తెలిపి మౌనం పాటించారు. ఈ నెల ఆఖరులో రాష్ట్ర ఎన్జీఓ నాయకులు అలపర్తి విద్యాసాగర్ జిల్లా కార్యవర్గ ఎన్నిక కోసం రాయచోటికి రానున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు వెంకటరమణ, రెడ్డికుమార్, జయచంద్రారెడ్డి, ఈశ్వరయ్య, చెంగల్ రెడ్డి, రాయచోటి తాలూకా సహాయక అధ్యక్షులు పల్లపు మహదేవ తదితరులు పాల్గొన్నారు.

కర్ణభేరి పగిలేలా.. ప్రాణాలు పోయేలా!

- ప్రాణాలు తీస్తున్న డీజే సిస్టం
- ప్రతి ఉత్సవంలో తప్పని సరైన డీజేలు
- అధిక శబ్దం ప్రమాదమని వైద్యులు హెచ్చరిస్తున్నా పట్టని వైనం
- చర్యలు చేపట్టాలంటూ ప్రజల విన్నపాలు


డీజే సౌండ్ బాక్సులు

రాజంపేట టౌన్ : ప్రస్తుతం కొన్ని ఉత్సవాలు, జాతర్లు, తిరునాళ్లలు జరుగుతున్న సందర్భంగా డీజేలను ఏర్పాటు చేయడం తప్పని సరైంది. డీజే ద్వారా వచ్చే మ్యూజిక్‌కు డ్యాన్స్ చేసే వారికి ఉత్సాహంగా, ఆనందంగా ఉంటుంది. కాని ఆ శబ్దం కొందరికి ప్రాణసంకటంగా మారుతోంది. పలు ప్రాంతాల్లో డీజేల వద్ద నృత్యం చేస్తూ మృతి చెందుతుండటం వంటి సంఘటనలు చూస్తున్నాం. తాజాగా ఈనెల 6వ తేదీ విశాఖ జిల్లాలో దసరా ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవిని ఊరేగించే సమయంలో అక్కడి నిర్వాహకులు డీజేని ఏర్పాటు చేశారు.కర్ణభేరి పగిలేలా వచ్చే ఆ శబ్దానికి అక్కడ డీజేకి దగ్గరగా ఉండి డ్యాన్స్ చేస్తూ ఓ వ్యక్తి కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. గతంలో రాజస్థాన్‌లో డీజే శబ్దానికి పిట్టగోడ కూలి పలువురు మృతి చెందిన సంఘటన కూడా జరిగింది. డీజే శబ్దం వల్ల వినికిడిలోపం, గుండెపోటు వచ్చే అవకాశం ఉందని ఒకవైపు వైద్యులు మీడియా, సోషల్ మీడియా ద్వారా హెచ్చరికలు చేస్తూనే ఉన్నారు. అయినప్పటికీ ఉత్సవాల్లో, జాతరలలో, తిరునాళ్లలో డీజేలు ఏర్పాటు చేస్తున్నప్పటికి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే ప్రభుత్వం కూడా డీజే సౌండ్‌పై కఠినమైన విధానం అవలంబించాల్సిన అవసరం ఉందనే వాదన ప్రజల నుంచి వినిపిస్తోంది.

వివిధ రకాల ఆరోగ్య సమస్యలు

సాధారణంగా రోడ్డుపై వెళ్లే సమయంలో వాహనాల వల్ల పెద్ద శబ్దాలు వస్తేనే ఇబ్బందికరంగా ఉంటుంది. అయితే గంటల తరబడి రోడ్లపై డీజే శబ్దాలు ఉంటే రహదారిలో వెళ్లే వారి పరిస్థితి ఎంత ఇబ్బందికరంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. డీజే శబ్దం వల్ల హృద్రోగులకు ప్రాణాపాయం కూడా ఉంటుంది. అలాగే వృద్ధులు, పిల్లలు, గర్భిణులకు కూడా ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశంఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ప్రధానంగా వినికిడి లోపం, గుండెపోటు వంటి సమస్యలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు.

అమలు కాని మార్గదర్శకాలు

శబ్దకాలుష్యంపై మార్గదర్శకాలు ఉన్నప్పటికి అవి ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు. ప్రధానంగా ఉత్సవాలు, జాతర్లు, తిరునాళ్లల సందర్భంగా డీజేలు ఏర్పాటు చేస్తుంటారు. ఆ సమయంలో డీజే వల్ల శబ్దం అధికంగా ఉంటుంది. బందోబస్తుగా ఉండే పోలీసు అధికారులు కూడా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో చిన్న, చిన్న ఉత్సవాలకు సైతం డీజేలను ఏర్పాటు చేస్తున్నారు.

మార్గదర్శకాలు ఇలా..

- బహిరంగ ప్రదేశాల్లో 10 డెసిబుల్స్‌కు మించి శబ్దం చేయరాదు
- ప్రైవేట్ ప్రదేశాల్లో డీజేలను పెట్టకూడదు
- లిఖిత పూర్వక అనుమతి లేకుండా లౌడ్ స్పీకర్లు, సౌండ్ బాక్స్‌లు ఏర్పాటు చేయకూడదు
- నిషిద్ధ ప్రాంతాలుగా గుర్తించిన ప్రదేశాల్లో సంగీత ధ్వనులు, డ్రమ్స్ కొట్టడం ఇతర శబ్దాలు చేయకూడదు
- సినిమా థియేటర్లలో సైతం 65 డెసిబుల్స్‌కు మించి శబ్దం ఉండకూడదు
- హాస్పిటల్స్, విద్యా సంస్థలు, దేవాలయాలు, న్యాయ స్థానాలకు వందమీటర్లలోపు డీజేలు కాని ఏ ఇతర సౌండ్ సిస్టంలను ఏర్పాటు చేయకూడదు

గుండెపోటు వచ్చే అవకాశం



డీజే శబ్దాల వల్ల గుండె సమస్యలు ఉన్నవారికి అకస్మాత్తుగా గుండెపోటు వచ్చే ప్రమాదముంది. మనిషికి చెవిలో కరభేరి సున్నితంగా ఉంటుంది. మోతాదుకు మించి శబ్దం వింటే కర్ణభేరి దెబ్బతిని వినికిడిలోపం వస్తుంది. ముఖ్యంగా డీజే సౌండ్ ఎక్కువగా ఉంటుంది అందువల్ల గుండె జబ్బులతో బాధపడేవారు, చిన్నపిల్లలు, గర్భిణులకు ఆరోగ్యపరంగా ఇబ్బందులు తలెత్తే అవకాశముంది.

– డాక్టర్ పాలనేని వెంకట నాగేశ్వరరాజు, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆసుపత్రి, రాజంపేట